## చుండూరు మారణకాండ

# హంతకుల కోసం వెతకండహో




చుండూరు మృతులను ఖననం చేసిన ప్రదేశం

**చుండూరు దళితుల్ని చంపిందెవరు?**

**కింది కోర్టు యావజ్జీవ ఖైదు విధించిన 21 మంది దోషులు కాకపోతే మరెవరు చంపినట్టు?**

– చుండూరు మారణకాండపై మూడునెలల క్రితం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పు చెప్పినప్పటి నుంచి అందర్నీ తొలిచేస్తున్న ప్రశ్న ఇది.

23 ఏళ్ల క్రితం 1991 ఆగస్టు 6న చుండూరులో చనిపోయిన 8 మంది దళితులు – ఆత్మహత్యలు చేసుకునో, అనారోగ్యంతోనో ప్రాణాలు విడిచారని ఇప్పటిదాకా ఎవరూ అనలేదు. చుండూరు చుట్టుపక్కల నాలుగు గ్రామాలకు చెందిన 200 మందికి పైగా రెడ్లు, తెలగలు వారిని తరిమి తరిమి పట్టుకుని చంపారనే అందరూ అన్నారు. చుండూరు ప్రత్యేక కోర్టూ అంది. పోలీసుల చార్జిషీటులో 219 మంది పేర్లున్నప్పటికీ 21 మందినే హంతకులుగా నిర్ధారించి ప్రత్యేక కోర్టు వారికి యావజ్జీవ ఖైదు విధించింది. మరో 35 మందికి యేడాది జైలుశిక్ష వేసింది. రెండున్నరేళ్ల విచారణలో 70 మంది సాక్షుల సాక్ష్యాన్ని పరిశీలించాకే ప్రత్యేక కోర్టు ఆ నిర్ధారణకు వచ్చింది. అయినా ఎవరి మీదా కేసు రుజువు కాలేదంది ఎ.పి. హైకోర్టు. ఒక్క మినహాయింపు కూడా లేకుండా దోషులందర్నీ నిర్దోషులుగా ప్రకటించి విడుదల చేసింది.

ఆనాడు పోలీసుల సమక్షంలో జరిగినవి భౌతిక హత్యలయితే ఈనాడు హైకోర్టులో జరిగినవి 'న్యాయ'హత్యలు. అప్పుడు ఇప్పుడు కూడా గెలిచింది అగ్రకుల న్యాయమే. ఈ మాట ఆ రోజూ అన్నాం. ఈ రోజూ అంటున్నాం.

ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు, దేశం మొత్తంమీద కూడా ఇదే 'న్యాయం' అమలవుతోంది. బీహార్‌లో రణవీర్‌సేన బతానిటోలా అనే ఊరిలో 1996లో 21 మంది దళితుల్ని (ఎక్కువ మంది స్త్రీలు, పిల్లలే), ముస్లింలను చంపితే; కింది కోర్టు 23 మందిని దోషులుగా నిర్ధారించి శిక్షలు వేస్తే; పాట్నా హైకోర్టు 2012లో అందర్నీ నిర్దోషులుగా ప్రకటించి విడుదల చేసింది. ఆ హత్యాకాండను ప్రత్యక్షంగా చూసిన సాక్షుల సాక్ష్యాన్ని చుండూరు కేసులో మన హైకోర్టులాగే పాట్నా హైకోర్టు కూడా నమ్మలేదు. 'నిజంగా చూసి ఉంటే వాళ్లు ఇవ్వాళ బతికి ఉండేవారే కాదు' అంది. అదే బీహార్‌లో అదే రణవీర్‌సేన లక్ష్మణ్‌పూర్ – బాతె అనే గ్రామంలో 1997 లో మరో 58 మంది దళితుల్ని (వీరిలోనూ స్త్రీలు, పిల్లలే ఎక్కువ) ఊచకోత కోస్తే; కింది కోర్టు 26 మందిని దోషులుగా నిర్ధారించి శిక్షలు వేస్తే; అదే పాట్నా హైకోర్టు 2013లో అందర్నీ నిర్దోషులుగా ప్రకటించి విడుదల చేసింది. 2014 వచ్చేసరికి అగ్రకుల హంతకులకు ఆ విధమైన 'క్లీన్‌చిట్' ఇవ్వడం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు వంతయింది.

### చుండూరు కేసు ఎందుకు రుజువు కాలేదన్నది హైకోర్టు?

కేసు రుజువు కాలేదని చెప్పడానికి హైకోర్టు జడ్జీలు చెప్పిన కారణాలు ఇవి :

1. హత్యలు జరిగిన సమయంపై సాక్ష్యంలో స్పష్టత లేదు.
2. పోలీసులకు సమాచారం ఇవ్వడంలో విపరీతమైన ఆలస్యం జరిగింది. హతుల బంధువులు, ప్రత్యక్ష సాక్షులు పోలీసులకు వెంటనే ఫిర్యాదు చేయలేదు. రక్త సంబంధీకులను చంపుతుంటే ఎవరైనా చూస్తూ ఊరుకుంటారని నమ్మడం కష్టం.

3. నేరం జరిగిన చోట్ల శవాలు దొరకకపోవడానికి కారణాలు సరిగ్గా చెప్పలేదు.

4. పోస్టుమార్టం రిపోర్టుల్లో వారు మరణించిన సమయాలు రకరకాలుగా ఉన్నాయి.

5. కింది కోర్టు సాక్ష్య విశ్లేషణ పద్ధతిని తప్పుగా అన్వయించింది.

ఈ కారణాల్లో కొన్నింటిని హైకోర్టు ఊహించుకొంది. కొన్నింటిలో అసాధ్యమైన సాక్ష్యాన్ని డిమాండ్ చేసింది. ఇప్పుడు ఒక్కో కారణాన్ని పరిశీలిద్దాం.

## నిజంగానే స్పష్టత లేదా?

హత్యలు జరిగిన సమయంపై స్పష్టత లేదనడానికి హైకోర్టు చూపిన ఉదాహరణ తుంగభద్ర మురుగుకాల్వ (ఇది చుండూరును ఆనుకుని ప్రవహించే కాలువ) లో దొరికిన శవాలకు సంబంధించిన సమయాలలో ఉన్న వ్యత్యాసాలు. ఆగస్టు 6 ఉదయం 11 గంటల సమయంలో పోలీసులు మాలపల్లెకు వచ్చారని, వారిని చూసి భయపడి తామంతా పారిపోయామని, కొంతసేపటి తర్వాత రెడ్లు, తెలగలు రకరకాల ఆయుధాలు చేత పట్టుకుని తమ వెంటపడ్డారని దళితులందరూ చెప్పారు. కోర్టులో సాక్ష్యంగా కూడా చెప్పారు. ఈ కేసులో 59వ సాక్షి అయిన చుండూరు ఎస్.ఐ కూడా ఈ దాడి 12 గంటల ప్రాంతంలో జరిగిందని చెప్పాడు. వాళ్లు తమవాళ్లు ముగ్గుర్ని కాగడా మల్లెలతోటలో చంపడం చూశామని చెప్పిన ముగ్గురు ప్రత్యక్ష సాక్షులు కూడా తమ సాక్ష్యంలో అదే సమయం చెప్పారు. కాని ఈ హత్యలపై మొట్టమొదట ఫిర్యాదు చేసిన జాలాది నీలమ్మ స్టేట్‌మెంట్‌లో మాత్రం పోలీసులు దాడి చేసిన సమయం మధ్యాహ్నం 2 గంటలని ఉంది. అలాగే మర్నాడు తుంగభద్ర కాల్వలో మొదటి విడతగా తేలిన రెండు శవాలకు జరిగిన పంచనామాలలో మృతులు ఆగస్టు 6 మధ్యాహ్నం 2-4 గంటల మధ్య బ్రతికి ఉన్నట్లుగా నమోదైంది. మౌఖిక సాక్ష్యానికి, రికార్డెడ్ సాక్ష్యానికి మధ్య సమయాలలో వస్తున్న ఈ వ్యత్యాసం వల్ల మౌఖిక సాక్ష్యాన్ని నమ్మలేమని, అందువల్ల కేసు కొట్టేస్తున్నామని హైకోర్టు అంది. అనేకమంది ప్రత్యక్ష సాక్షులు, ఒక పోలీసు అధికారి కూడా దాడి 11-12 గంటల మధ్య సమయంలో జరిగిందని చెపుతున్నపుడు దాన్ని పక్కనపెట్టి ఒక కంగారులో రాసిన ఫిర్యాదులో, పంచనామాలలో ఉన్న సమయాన్ని మాత్రమే నమ్మడం హైకోర్టుకు భావ్యమేనా?

> “మొదటి మూడు శవాలు వేసిన చోటే ఎందుకుండిపోయాయని జడ్జీలకు అనుమానం వచ్చింది. తరువాతి అయిదు శవాలు చంపిన చోట ఎందుకు లేకుండా పోయాయని కూడా జడ్జీలకు అనుమానం వచ్చింది. కాలువలో కొట్టుకుపోనందుకూ అనుమానమే, కొట్టుకుపోయినందుకూ అనుమానమే. ఆ రోజు తుంగభద్ర కాలువలో నీటి ప్రవాహం ఎంత ఉందో చెప్పే సాక్ష్యమేదీ కోర్టు ముందు లేదు. కాని కాలవంతా గుర్రపుడెక్క మొక్కలతో నిండి ఉందనే సాక్ష్యం మాత్రం ఉంది. ఆ శవాలు వాటి మధ్యే కనిపించాయన్న పంచనామా సాక్ష్యమూ ఉంది. అయినా అవి కదలనందుకు జడ్జీలు తప్పు పట్టారు. ఆ కారణంతోనే ఈ హత్యలను కళ్ళారా చూసిన వాళ్ళ సాక్ష్యాన్నీ తప్పుడు సాక్ష్యం అన్నారు.”

శవ పంచనామా ఉద్దేశం పంచనామాదార్ల అభిప్రాయంలో చచ్చిన మనిషిది బలవన్మరణమా? లేక సహజ మరణమా అని తెలుసుకోవడం వరకే. కోర్టులో ఇతరవాటికి దాన్ని వాడకూడదని ఇప్పటికే సుప్రీంకోర్టు అనేక తీర్పుల్లో చెప్పి ఉంది. అయినా దానిమీదే నమ్మకముంచారంటే అర్థం ఏమిటి? అన్ని విషయాలనూ పరిగణనలోకి తీసుకోకుండా నమ్మదలచుకున్న దానిని మాత్రమే నమ్మి తీర్పులివ్వడానికా హైకోర్టు ఉన్నది !

## ఆలస్యం అంత పెద్ద తప్పా?

ఊరిలో 8 మందిని చంపేస్తే ప్రత్యక్ష సాక్షులుగా చెప్పుకుంటున్నవారు గానీ, బంధువులు గానీ పోలీసులకు సమాచారం ఎందుకు ఇవ్వలేదని హైకోర్టు మరో అనుమానం వ్యక్తం చేసింది. చికిత్స కోసం తెనాలి ఆస్పత్రిలో చేరినవారైనా పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదని అడిగింది. పోలీసులే తెనాలి ఆస్పత్రికి వచ్చి స్టేటుమెంటు తీసుకునేంతవరకూ ఎందుకు ఆగాల్సి వచ్చిందని ప్రశ్నించింది. ఏదైనా నేరం జరిగినట్లు తెలిస్తే ఆ విషయం వెంటనే పోలీసులకు చెప్పడం ప్రతి పౌరుడి విధి అని క్రిమినలు ప్రొసీజరు కోడ్ చెబుతున్నపుడు ప్రత్యక్ష సాక్షులూ, బాధితుల బంధువులూ ఆ పని చేయడంలో ఎందుకు విఫలమయ్యారని హైకోర్టు విస్తుపోయింది. (ఈ దేశంలో ప్రతి పౌరుడికి క్రిమినలు ప్రొసీజరు కోడ్ గురించి తెలుసనుకుంటున్న హైకోర్టు 'జ్ఞానానికి' విస్తుపోవడం తప్ప మనం చేయగలిగింది ఏం లేదు.)

అంటే ఆగస్టు 6న జరిగిన హత్యల గురించి ఆగస్టు 7 దాకా బాధితులు పోలీసులకు తెలియజేయకపోవడం పూర్తిగా బాధితుల తప్పేనని హైకోర్టు భావిస్తున్నట్టుంది. ఆ ఆలస్యానికి కారణాలేమిటో కేసు కాగితాలు చదివిన ఎవరికైనా అర్థమవుతుంది. ఊళ్లో పోలీసు బందోబస్తు ఉండగానే నాలుగు గ్రామాల అగ్రకులస్తులు మీటింగు జరుపుకోగలిగారు. పోలీసులు చూస్తుండగానే ఆయుధాలు చేతపట్టుకుని దళితులను తరమగలిగారు.

ఆయుధాలతో సహా పట్టుకున్న 50 మంది అగ్రకులస్తులను సి.ఐ. చెప్పాడని ఎస్.ఐ వదిలేయడం వాళ్లు చూశారు. దళితులను కాపాడడానికి ఏ మాత్రం ప్రయత్నించని పోలీసులు రెడ్డిగార్ల పిల్లలను స్కూలు నుండి తీసుకురావడానికి మాత్రం ఎస్కార్టు ఇచ్చారు. వీటన్నిటిని బట్టి పోలీసులు దళితులకు భద్రత కల్పించడంలో విఫలమవడమే కాక వారిపై అగ్రకులస్తుల దాడికి పరోక్షంగా దోహదం చేశారని స్పష్టమవుతోంది. ఇంతటి ప్రతికూల పరిస్థితిలో తామిచ్చే సమాచారాన్ని గానీ, ఫిర్యాదును గానీ పోలీసులు తీసుకుని కేసు పెడతారనే నమ్మకం బాధితులకూ, వారి బంధువులకూ ఉంటుందా? సెషన్స్ కోర్టు ఈ ప్రశ్న వేసుకుని – అప్పటికి బాధితులు పోలీసులపై నమ్మకం కోల్పోయారని తానే సమాధానం కూడా చెప్పింది. సమాచారం ఇవ్వడంలోనో, ఫిర్యాదు చెయ్యడంలోనో ఆలస్యం జరిగితే అలాంటి సందర్భాన్ని లోతుగా, జాగ్రత్తగా, క్షుణ్ణంగా పరిశీలించమని కోర్టులు అంటాయి గానీ ఫిర్యాదునే తిరస్కరించి కేసును కొట్టేయమని అనవు. ఈ కేసులో ఫిర్యాదు చేయడంలో ఆలస్యం జరిగినా అందుకు సహేతుక కారణం ఉంది. సహేతుక కారణం ఉన్నప్పుడు ఫిర్యాదును అనుమానించాల్సిన అవసరం లేదు. కాని మన హైకోర్టు మాత్రం అనుమానించింది. ఆ అనుమానానికి వాళ్ళు ఇచ్చిన ఉదాహరణలలో ఒకటి జాలాది డేవిడ్ రాజు సాక్ష్యం. ఇతను ఈ కేసులో 4వ సాక్షి. ప్రత్యక్ష సాక్షి కూడా. మొదట దొరికిన రెండు శవాలలో ఒకటి ఇతని తండ్రి జాలాది మత్తయ్యదైతే, రెండోది ఇతని చిన్నాయన ఇమ్మానియేలుది. వాళ్ళిద్దరి మీద దాడి జరుగుతుంటే డేవిడ్ రాజు అడ్డుపోకపోగా పారిపోవడమేమిటని హైకోర్టు ఆశ్చర్యపోయింది. కొడుకు అనేవాడు ప్రాణాన్ని పణంగా పెట్టి అయినా సరే తన వాళ్ళను కాపాడుకుంటాడని, అలాంటిది అతను ఆ హత్యలను చూసి కూడా ఎవరికీ చెప్పకపోవడటమేమిటని, అందువల్ల అతని సాక్ష్యాన్ని ఎలా నమ్మాలని హైకోర్టు సగటు సినిమా ప్రేక్షకుడిలాగా వ్యాఖ్యానించింది. అప్పటికి డేవిడ్ రాజు వయస్సు 15 సంవత్సరాలనేది కూడా పరిగణనలోకి తీసుకోకుండా అతని చర్యను తప్పుపట్టగలిగింది హైకోర్టు.



ఊహ అవసరమైన చోట సాక్ష్యాన్ని డిమాండ్ చేసింది హైకోర్టు, సాక్ష్యం ఉన్నచోట అనవసరపు ఊహలకు పోయింది.

ఒక ఘటన జరిగినప్పుడు మనుషులంతా ఒకే రకంగా వ్యవహరిస్తారనీ, ఒకే పద్ధతిలో స్పందిస్తారనీ ఊహించలేము. కళ్ళ ముందు అయినవాళ్ళు హతులయి పోతుంటే కొందరు నిస్తేజంగా కుప్పకూలిపోవచ్చు, కొందరు భయంతో పారిపోవచ్చు. కొందరు నిలబడి కొట్లాడనూవచ్చు. కాని అదెప్పుడు? ఒకళ్ళిద్దరు మనుషులు మాత్రమే దాడి చేస్తున్నప్పుడు అది సాధ్యమేమో గానీ వందల మంది ఆయుధాలతో తరుముకొస్తున్నప్పుడు వాళ్ళను ఎదుర్కోవడం ఎవరికి సాధ్యం? హత్యలు జరిగాయని తెలిసి కూడా (తెనాలి ఆర్డీవో ఆగస్టు 6 రాత్రే చుండూరు పోలీసు స్టేషన్‌కు ఫోన్‌చేసి చెప్పాడని మరచిపోకండి) శవాలు దొరకని కారణంగా కేసు పెట్టని పోలీసుల చర్య కంటే ఒక మారణకాండలో దగ్గరి బంధువులను కోల్పోయి, భయభ్రాంతులకు లోనయి ఉన్న దళితులు ఏడవటానికంటే ముందే పోలీసుస్టేషన్‌కెళ్ళి కేసు పెట్టకపోవడం హైకోర్టు దృష్టిలో ఎక్కువ నేరం అయ్యిందంటే ఏమనాలి మనం?

## శవాలు అక్కడే ఎందుకు లేవు? లేదా అక్కడే ఎందుకున్నాయి?

ఆ రోజు చుండూరులో హత్య చేయబడిన 8 మందినీ ఒక చోట కాదు, మూడు వేర్వేరు చోట్ల కొట్టి చంపారు. ముగ్గురిని తుంగభద్ర కాలువ ఒడ్డునున్న కాగడా మల్లెలతోటలో చంపి, ఆ కాలువలోకి తోసేశారు. ఒకరిని 1వ నంబరు బ్రాంచ్ కెనాల్ పక్కన చంపి శవాన్ని ఆ కాలువలోకి తోసేశారు. మిగతా నలుగురిని కార్లగేటు దగ్గరున్న పశువుల కొట్టం ముందు చంపి కొట్టంలోకి శవాలను తీసుకెళ్ళారు. వీటన్నిటికీ సాక్ష్యం ఉంది. అయితే మొదటి మూడు శవాలు వేసిన చోటే ఎందుకుండిపోయాయని జడ్జీలకు అనుమానం వచ్చింది. తరువాతి అయిదు శవాలు చంపిన చోట ఎందుకు లేకుండా పోయాయని కూడా జడ్జీలకు అనుమానం వచ్చింది. కాలువలో కొట్టుకుపోనందుకూ అనుమానమే, కొట్టుకుపోయినందుకూ అనుమానమే. ఆ రోజు తుంగభద్ర కాలువలో నీటి ప్రవాహం ఎంత ఉందో చెప్పే సాక్ష్యమేదీ కోర్టు ముందు లేదు. కాని కాలవంతా గుర్రపుడెక్క మొక్కలతో నిండి ఉందనే సాక్ష్యం మాత్రం ఉంది. ఆ శవాలు వాటి మధ్యే కనిపించాయన్న పంచనామా సాక్ష్యమూ ఉంది. అయినా అవి కదలనందుకు జడ్జీలు తప్పు పట్టారు. ఆ కారణంతోనే ఈ హత్యలను కళ్ళారా చూసిన వాళ్ళ సాక్ష్యాన్నీ తప్పుడు సాక్ష్యం అన్నారు.

ఇటీవల జరిగిన బియాస్ దుర్ఘటన అందరికీ గుర్తుండే ఉంటుంది. ఒకే రోజు చనిపోయిన 25 మంది విద్యార్థుల శవాలు వేరువేరు చోట్ల వేరువేరు రోజులలో దొరకలేదా? వాటి పోస్టుమార్టం రిపోర్టులలో ఒకరోజు తేడా వస్తే వాళ్ళు చనిపోయిన తేదీయే అనుమానాస్పదం అయిపోతుందా?

మరి మిగిలిన ఐదు హత్యల విషయంలో జడ్జిగార్ల అనుమానమేమిటి? మంద్రు రమేష్ ఒకటవ నంబర్ బ్రాంచ్ కెనాల్ దగ్గరున్న పొలాలలో చంపబడితే అతని శవం కాలువలోకి ఎలా వచ్చి చేరింది? కార్లగేటు వద్దనున్న పశువుల కొట్టం ముందు చంపబడిన నలుగురిలో ఇద్దరి శవాలు గోనె సంచిలోకి ఎలా వెళ్ళాయి? అంతేకాదు ఆ నలుగురి శవాలు రెండు వేరు వేరు కాల్వల్లో, వేరువేరు చోట్ల ఎలా దొరికాయి? ఎవరు వాటిని అక్కడికి చేర్చారు? వాటిని తరలించినట్లు సాక్ష్యమేది? అంటూ హైకోర్టు ప్రశ్నలు సంధించింది.

మనిషిని ఎక్కడ చంపారో శవం అక్కడ లేకుంటే రెండు రకాల ఊహలకు అవకాశం ఉంటుంది. హత్య అక్కడ జరగలేదని ఒకటి కాగా, సాక్ష్యాన్ని మాయం చేయడానికి దానిని అక్కడ నుంచి తొలగించారనేది మరొకటి.

ఫలానా ఫలానా వారు ఫలానా వ్యక్తిని ఫలానా ఆయుధాలతో ఫలానా చోట చంపుతున్నప్పుడు చూశామని సాక్షులు చెబుతున్నప్పుడు మొదటి ఊహకు ఆస్కారమే లేదు. మిగిలింది రెండో ఊహ. కాని హైకోర్టు జడ్జీలు మొదటి ఊహకే ప్రాధాన్యమిచ్చారు. రెండో ఊహకు స్థానమే లేకుండా చేశారు. దాంతో చంపడం వరకే చూసిన ప్రత్యక్ష సాక్షుల సాక్ష్యాన్ని నమ్మదగింది కాదు అన్నారు. ఊహ అవసరమైన చోట సాక్ష్యాన్ని డిమాండ్ చేసింది హైకోర్టు, సాక్ష్యం ఉన్నచోట అనవసరపు ఊహలకు పోయింది.

## మరణించిన సమయాలు వేరువేరుగా ఎందుకున్నాయి?

హతులు మరణించిన సమయాలు పోస్ట్‌మార్టమ్ రిపోర్టులలో రకరకాలుగా ఉన్నాయని, అందువల్ల మృతులంతా 1991 ఆగస్టు 6వ తేదీనే చనిపోయినట్లుగా నమ్మలేం అన్నారు హైకోర్టు జడ్జీలు. పోస్టుమార్టం రిపోర్టులను క్షుణ్ణంగా పరిశీలించకుండానే హైకోర్టు జడ్జీలు ఈ మాటలు అన్నారని మా ఫిర్యాదు. ఎనిమిది శవాలలో మూడు ఆగస్టు 7న, అయిదు ఆగస్టు ఎనిమిదిన దొరికాయి. వీటికి పోస్టుమార్టంలు 8, 9, 10 తేదీలలో జరిగాయి. 2 నుంచి 5 రోజుల ముందు వీరి మరణాలు సంభవించాయని డాక్టర్లు రాశారు. వాళ్ల ప్రకారమే ఒక్క దేవరపల్లి జయరాజు మినహా మిగతా అందరూ ఆగస్టు 6న చనిపోయి ఉండే అవకాశం ఉంది. అయినా అందరూ ఆగస్టు 6 మధ్యాహ్నం పూట హత్య చేయబడ్డారని ప్రాసిక్యూషన్ ప్రవేశపెట్టిన సాక్ష్యం నమ్మదగినదిగా లేదని హైకోర్టు జడ్జీలు అన్నారు. జయరాజు విషయంలో అయినా ఆ పొరపాటు ఎలా వచ్చి ఉండే అవకాశం ఉందంటే అతని శవం బాగా కుళ్ళిపోయిన స్థితిలో దొరకడం వల్ల. ఆ స్థితిలో దొరికిన శవాల మరణ సమయాన్ని కచ్చితంగా అంచనా వేయడం కష్టమని, అందువల్ల వాటి విషయంలో డాక్టర్లు అంచనా వేసిన సమయం పూర్తిగా నమ్మదగినది కాదని సుప్రీంకోర్టు చెప్పిన సంగతి మన హైకోర్టు జడ్జీలకు తెలియదనుకోవాలా? ఇటీవల జరిగిన బియాస్ దుర్ఘటన అందరికీ గుర్తుండే ఉంటుంది. ఒకే రోజు చనిపోయిన 25 మంది విద్యార్థుల శవాలు వేరువేరు చోట్ల వేరువేరు రోజులలో దొరకలేదా? వాటి పోస్టుమార్టం రిపోర్టులలో ఒకరోజు తేడా వస్తే వాళ్ళు చనిపోయిన తేదీయే అనుమానాస్పదం అయిపోతుందా?

## సాక్ష్య విశ్లేషణ, అన్వయం తప్పుగా జరిగాయి

సాక్షులు తమ సాక్ష్యంలో పేర్కొన్న ముద్దాయిలందరికీ కిందికోర్టు శిక్షలు వేయలేదనీ, అంటే కోర్టు వాళ్ల సాక్ష్యంలో కొంత భాగాన్ని మాత్రమే నమ్మిందని, ఇది తప్పుడు సాక్ష్య విశ్లేషణా పద్ధతని, ఒక సాక్షి చెప్పింది నమ్మితే మొత్తాన్ని నమ్మాలి లేకుంటే మొత్తాన్ని తిరస్కరించాలి అని హైకోర్టు ఒక కొత్త న్యాయసూత్రాన్ని ముందుకు తెచ్చింది. ఈ సూత్రాన్ని ఇండియాలో వాడడం చాలా ప్రమాదకరం. వేరే దేశాల సంగతేమోగానీ మన దేశంలో ఈ సూత్రాన్ని వాడితే బాధితులకు న్యాయం జరగడం అసాధ్యమైపోతుంది. సాక్షి తన సాక్ష్యంలో నిజాలూ చెప్పొచ్చు... అబద్ధాలూ చెప్పొచ్చు. ఒక సాక్షి కొంత నిజం చెప్పి, కొంత అబద్ధం చెప్పొచ్చు. సాక్ష్యంలోని సత్యాన్ని, అసత్యాన్ని వేరు చేయడమే జడ్జీల పని. నిసార్ అలీ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్ కేసులో సుప్రీంకోర్టు 1957 లోనే ఈ సూత్రం ఇండియాకి వర్తించదని చెప్పింది. ఆ తర్వాత అనేక కేసులలో కూడా దీనికి అనుగుణంగా తీర్పులు వచ్చాయి. అయినా మన హైకోర్టు మాత్రం వందశాతం సత్యం ఉంటేనే అది 'సాక్ష్యం' అవుతుందని అభిప్రాయపడుతోంది.

సాక్ష్యాన్ని ఉటంకించడంలోను, విశ్లేషించడంలోను హైకోర్టు చేసిన తప్పులు ఇంకా ఎన్నో ఉన్నాయి. బాధితుల అప్పీల్స్‌ను వినకపోవడం ఒక పెద్ద తప్పు. బాధితుల ప్రతినిధి మీద, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మీద కోర్టు హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇవ్వడం మరో పెద్ద తప్పు. ఈ దేశంలో కులమే హక్కుల ఉల్లంఘనలకు ఒక అతిపెద్ద కారణంగా ఉంటున్నపుడు, భారత రాజ్యాంగంతో నిమిత్తం లేకుండా సమాజంలో ఇప్పటికీ అగ్రవర్ణ, అగ్రకుల పెత్తనమే కొనసాగుతున్నపుడు ఇటువంటి తీర్పులు ఎటువంటి సంకేతాలనిస్తాయి?

ఈ తీర్పుకు వ్యతిరేకత తెలియజేయాల్సిన బాధ్యతే కాదు సుప్రీంకోర్టులోనైనా చుండూరు బాధితులకు న్యాయం సాధించుకోవాల్సిన బాధ్యత మనందరి మీదా ఉంది. ఆ కృషిలో కలిసి రమ్మని కోరుతూ...

17-7-2014

**మానవహక్కుల వేదిక**

**Human Rights Forum (HRF)**

ప్రచురణ కర్తలు : **ఎస్. జీవన్ కుమార్** – 98489 86286, **వి.ఎస్. కృష్ణ** – 94404 11899